# ఆదిలాబాద్ వార్త

మంచిర్యాల, కొమురం భీం ఆసిఫాబాద్, నిర్మల్

శనివారం 6, జూన్ 2026


# బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



**✳ కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ కె.హరిత**

**ఆసిఫాబాద్, జూన్ 5, ప్రభాతవార్త**

ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని ఈ నెల 12 నుండి 19వ వరకు విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ యువరాజ్ మర్మాట్‌తో కలిసి బడిబాట కార్యక్రమం నిర్వహణపై అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని, పాఠశాలలను విద్యార్థుల నమోదు శత శాతం ఉండాలని, ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కృషి చేయాలని తెలిపారు. అంగన్వాడిలలో ఉన్న విద్యార్థి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉండాలని, ప్రాథమిక పాఠశాలలో ఉన్న విద్యార్థి ప్రాథమికోన్నత పాఠశాలలో ఉండాలని, ఇందులో ఉన్న విద్యార్థి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు వెళ్లాలని, 10వ తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరేలా పర్యవేక్షించాలని తెలిపారు. ఏ విద్యార్థి బడి బయట ఉండకూడదని, ప్రభుత్వ పాఠశాలలలో చదివే విద్యార్థులకు పాఠశాల ప్రారంభమైన రోజునే పాఠ్యపుస్తకాలు, వర్క్ పుస్తకాలు, ఏకరూప దుస్తులు, అల్పాహారం, నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించడం జరుగుతుందని, విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం విద్యారంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని తెలిపారు. బడిబాట కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి సచ్చిదానంద చారి, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి నదీమ్, డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, అన్ని ప్రభుత్వ యాజమాన్యాల పాఠశాలల అధికారులు పాల్గొన్నారు.



# పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది

**● రఘునాథ్ వెరబెల్లి, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు**

**మంచిర్యాల, జూన్ 5, ప్రభాతవార్త**

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఈరోజు మంచిర్యాల మున్సిపల్ కార్పొరేషన్ వేంపల్లి 15 వ డివిజన్‌లో బీజేపీ శ్రేణులు ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ వెరబెల్లి పాల్గొని బీజేపీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా రఘునాథ్ మాట్లాడుతూ పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందని అన్నారు. పెరుగుతున్న గ్లోబల్ వార్మింగ్ అరికట్టడానికి ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడాలని మొక్కలు నాటి చెట్లను పెంచాలని పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మా కే నామ్ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడం జరిగింది అని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమిరిశెట్టి రాజ్ కుమార్, డేగ బాపు, మోటపలుకుల తిరుపతి, రాయెల్లి మల్లేష్, అవిడపు రాజా బాబు, రంగ శ్రీశైలం, నాంపల్లి శ్రీనివాస్, నల్ల రవి, తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి

**✪ మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య**



**లక్షెట్టిపేట, జూన్ 5, ప్రభాతవార్త**

పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని మంచిర్యాల జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి.చంద్రయ్య అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా శుక్రవారం జిల్లాలోని లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన గ్రామసభ కార్యక్రమానికి జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు రావు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల పంచాయతీ అధికారి, ఎపిఓ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ సర్పంచ్, అధికారులతో కలిసి హాజరై స్వచ్ఛ గ్రామం సురక్షిత జలవాయు పథకంలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని, ప్రత్యామ్నాయమైన పర్యావరణహిత వస్తువులను వినియోగించడం ద్వారా ప్రకృతిని కాపాడుకోవాలని తెలిపారు. చెట్లు నాటడమే కాకుండా నీటిని పొదుపుగా వినియోగించాలని, ప్రతి వర్షపు నీటి బొట్టును భూమిలో ఇంకేలా కృషి చేయాలని, ప్లాస్టిక్ కవర్లు, సంచులు, బాటిళ్లు వినియోగించడం వలన పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్లాస్టిక్ వస్తువులను నిషేధించాలని తెలిపారు. పారిశుధ్య నిర్వహణలో భాగంగా పొడి, తడి, శానిటరీ, ప్రత్యేక సంరక్షణ వ్యర్థాలుగా వేరు చేయడం ద్వారా పరిశుభ్రమైన వాతావరణాన్ని మిగతా 2లో..

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం



**✳ పర్యావరణ వేడుకల్లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ హరిత, ఎస్పీ, డీఎఫ్ఓ, అధికారులు**

**పెంచికల్ పేట్, జూన్ 5, ప్రభాతవార్త**

పర్యావరణానికి పెనుముప్పుగా మారిన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి, పర్యావరణ హిత ప్రత్యామ్నాయలను అవలంబించాలని కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కలెక్టర్ హరిత పిలుపునిచ్చారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని పెంచికల్ పేట్ ఫారెస్ట్ కాంప్లెక్స్ లో శుక్రవారం నిర్వహించిన వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించడంతోపాటు ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని సూచించారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. జిల్లా అటవీ అధికారి సిహెచ్ బాలమణి మాట్లాడుతూ, అటవీ సంపదను కాపాడడం ద్వారా పర్యావరణ సమతుల్యతను పరిరక్షించవచ్చని తెలిపారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. అడవులు, మిగతా 2లో..

# పర్యావరణాన్ని కాపాడుకోవాలి

**(మొదటిపేజీ తరువాయి)**

నెలకొల్పవచ్చని, కాలువల శుభ్రత, నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని, దోమల వ్యాప్తిని అరికట్టేందుకు పరిశుభ్రత పాటించాలని తెలిపారు. రైతులు శాస్త్రీయ పద్ధతిలో సేంద్రియ వ్యవసాయ సాగు చేయాలని, ఒకే రకమైన పంట కాకుండా పంట మార్పిడి విధానాన్ని అవలంబించి ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, ఆధునిక సాగు పద్ధతులను అనుసరించాలని తెలిపారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని తెలిపారు. రహదారి భద్రత, ట్రాఫిక్ నియమాల పాటింపు ప్రతి పౌరుడి బాధ్యత అని తెలిపారు. ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమం ప్రాముఖ్యత, ఓటరు జాబితా నవీకరణలో ప్రజల భాగస్వామ్యం అవసరాన్ని వివరించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ, అభివృద్ధి పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం

**(మొదటిపేజీ తరువాయి)**

నీటి వనరులు, జీవవైవిధ్య పరిరక్షణ ద్వారానే మెరుగైన భవిష్యత్తు సాధ్యమవుతుందని చెప్పారు. జిల్లా ఎస్పీ నికిత పంత్ మాట్లాడుతూ, నేడు అధికంగా వినియోగిస్తున్న ప్లాస్టిక్ వల్ల రాబోయే తరాలు తీవ్ర పర్యావరణ సమస్యలను ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు నేల, నీరు, జీవవరణాన్ని కలుషితం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచ్, గ్రామస్తులు పాల్గొని పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు తెలిపారు.

# పచ్చదనం కోసం ప్రజల భాగస్వామ్యం

### - సిర్పూర్ పేపర్ మిల్స్ సీఎస్ఆర్ ఆధ్వర్యంలో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 5, ప్రభాతవార్త :**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ది సిర్పూర్ పేపర్ మిల్స్ లిమిటెడ్ సీఎస్ఆర్ కార్యక్రమంలో భాగంగా స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భట్టుపల్లి, కోసిని, బురుదగూడ, నాగంపేట్, బరేగూడ, చింతగూడ గ్రామ పంచాయతీలతో పాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమాలు ప్రజల్లో విశేష స్పందన పొందాయి. ఈ కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ, స్వచ్ఛత ర్యాలీలు, క్లీనప్ డ్రైవ్‌లు, మొక్కల నాటకం, వ్యాసరచన పోటీలు, పర్యావరణ అవగాహన సదస్సులు నిర్వహించారు. ప్రకృతి పరిరక్షణ, పరిశుభ్రత, ప్లాస్టిక్ వినియోగ నియంత్రణ, హరితహారం ప్రాముఖ్యతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఉజ్వల్ కుమార్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. చెట్ల పెంపకం, పరిశుభ్రత పాటించడం ద్వారా భావితరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చన్నారు. పర్యావరణ పరిరక్షణకు సమిష్టి కృషి అవసరమని, ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని వక్తలు పిలుపునిచ్చారు. పలు గ్రామాల్లో నిర్వహించిన ఈ కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో చైతన్యం పెంపొందించడంతో పాటు హరిత సమాజ నిర్మాణానికి దోహదపడేలా సాగాయి. ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, గ్రామస్థులు, విద్యార్థులు, స్పర్ష్ సోషల్ ఫౌండేషన్ ప్రతినిధులు బి. సుశీల, పి. శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.




ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

# అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

**సారంగాపూర్, జూన్ 05, ప్రభాతవార్త:**



మండలంలోని జెవిలి గ్రామంలో సర్పంచ్ కొమ్ము సురేందర్ అధ్యక్షతన శుక్రవారం ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. ఈ సభకు బీజేపీ శాసనసభా పక్ష (బీజేఎల్పీ) నేత, నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా గ్రామంలో తొమ్మిది లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రహరీ గోడను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం వీఈఓ వర్క్ షెడ్ నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగా కనీసం ఐదు మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రకృతిని మనం రక్షిస్తేనే, అది మనల్ని రక్షిస్తుందని పేర్కొన్నారు. అభివృద్ధి పేరిట అడవులను నరికివేయడం వల్లనే ప్రస్తుతం అనేక ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ సమస్యలు ఎదురవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. భవిష్యత్ తరాల మనుగడ కోసం పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం మండలంలోని పలు గ్రామాలల్లో ఇటీవలే వివిధ కారణాలతో మృతి చెందిన పలువురి కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించి, వారి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షుడు కాల్వ నరేష్, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి విలాస్, స్థానిక సర్పంచులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

### వైద్యం తెలియని రోజుల్లో సేవలు అందించిన

# డాక్టర్ ఛత్రపతి గౌడ్ కన్నుమూత

**సారంగాపూర్, జూన్ 05, ప్రభాతవార్త:**



మండలంలోని కౌట్ల (బి) గ్రామానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ ఛత్రపతి గౌడ్ శుక్రవారం కన్నుమూశారు. ఆయన స్వగ్రామం దన్నూరు అయినప్పటికీ, ఉమ్మడి జిల్లాలో ఎన్నో ప్రభుత్వ ఉద్యోగాలు వచ్చిన వాటిని వదులుకొని కౌట్ల (బి) గ్రామానికి వచ్చి స్థిరపడ్డారు. ఈ ప్రాంతంలో వైద్య సేవలు అంటేనే తెలియని రోజుల్లో ఆయన గ్రామీణ ప్రజలకు వైద్యం అందించడం ప్రారంభించారు.

సారంగాపూర్, చించోలి (ఎం), స్వర్ణ, జెవిలి, అడెల్లి గ్రామాలతో పాటు చుట్టుపక్కల ఉన్న నలుమూలల తండాలన్నింటికీ సైకిల్‌పైనే వెళ్లి రోగులకు చికిత్స అందించిన గొప్ప మానవతావాది డాక్టర్ ఛత్రపతి గౌడ్. నిరుపేదల వద్ద డబ్బులు తీసుకోకుండా ఉచితంగా వైద్యం అందించిన ఘనత ఆయనది. దాదాపు నాలుగు దశాబ్దాల పాటు ఈ ప్రాంతంలో ఆయన నిరంతరాయంగా వైద్య సేవలు అందించారు. రోగులతో ఆప్యాయంగా మాట్లాడుతూ, ఎలాంటి ఆందోళన చెందవద్దని, త్వరలోనే తగ్గిపోతుందని ధైర్యం చెబుతూ రోగుల గుండెల్లో నమ్మకాన్ని నింపిన మంచి మనసున్న వ్యక్తిగా గుర్తింపు పొందారు. సమాజ సేవయే ముఖ్యమని, వైద్య సేవయే మాధవ సేవ అనే భావనకు ప్రతీకగా నిలిచిన ఆయన నిరుపేదల పాలిట సంజీవనిలా మారారు. ఈయన స్ఫూర్తితో ఎంతో మంది యువకులు ఆయన వద్ద వైద్యంలో మెళకువలు నేర్చుకొని ప్రస్తుతం వివిధ ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందిస్తున్నారు. డాక్టర్ ఛత్రపతి గౌడ్ మరణం సారంగాపూర్ మండల ప్రజలకు తీరని లోటని, ఆయన సేవలు ఎప్పటికీ చిరస్మరణీయమని స్థానికులు, ప్రజాప్రతినిధులు పేర్కొంటూ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

# ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఆరెగూడ విద్యార్థి ఎంపిక

### - అభినందించిన ఉపాధ్యాయులు

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 5, ప్రభాతవార్త :**



కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో జడ్పీహెచ్ఎస్ ఆరెగూడ పాఠశాల విద్యార్థి జాబరి శివప్రసాద్ రాష్ట్రస్థాయిలో ఎంపికై ప్రతిభ చాటాడు. విద్యార్థి సాధించిన విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు నెలకొన్నాయి. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పర్ష చంద్రశేఖర్, ఉపాధ్యాయులు విద్యార్థిని శాలువాతో సన్మానించి అభినందించారు. మిఠాయిలు పంచి శుభాకాంక్షలు తెలిపారు. ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థి రాష్ట్రస్థాయి స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గర్వకారణమన్నారు. ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్ ద్వారా 9వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ప్రతి సంవత్సరం రూ.12,000 చొప్పున మొత్తం రూ.48,000 ఆర్థిక సహాయం అందుతుందని తెలిపారు. ఈ పథకం పేద, ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉన్నత విద్యాభ్యాసంలో ఎంతో తోడ్పాటునిస్తుందన్నారు. విద్యార్థి విజయానికి ఉపాధ్యాయుల కృషి, తల్లిదండ్రుల ప్రోత్సాహం కారణమని పేర్కొంటూ, ఇతర విద్యార్థులు కూడా శివప్రసాద్‌ను ఆదర్శంగా తీసుకుని కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. విద్యార్థి జాబరి శివప్రసాద్ మాట్లాడుతూ, తన విజయానికి సహకరించిన ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు కృతజ్ఞతలు తెలిపాడు. భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించి మంచి స్థాయికి చేరుకోవాలన్నదే తన లక్ష్యమని పేర్కొన్నాడు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొని శివప్రసాద్‌ను అభినందించారు.

# షియర్ వాల్ టెక్నాలజీతో 12 రోజుల్లోనే ఇంటి నిర్మాణం

## - జిల్లా కలెక్టర్ కె.హరిత

**కెరమెరి,జూన్ 5, ప్రభాతవార్త:**

షియర్ వాల్ టెక్నాలజీతో జిల్లాలోని కొరారి గ్రామంలో 12 రోజుల్లోనే ఇంటి నిర్మాణం చేపట్టి పనులు పూర్తి చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కె.హరిత ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చేతుల మీదుగా షియర్ వాల్ టెక్నాలజీతో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు ప్రారంభించడం జరిగిందని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు మరింత వేగవంతంగా, నిర్ణీత వ్యయపరిమితితో 5 లక్షల రూపాయలలో ఇంటిని నిర్మించుకునేలా ప్రభుత్వం అన్ని రకాలుగా ప్రోత్సాహాన్ని అందిస్తుందని తెలిపారు. ఇందులో భాగంగా 10 15 రోజుల్లోనే ఇంటి నిర్మాణం పూర్తి చేసేందుకు హౌసింగ్ కార్పొరేషన్ అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా గృహ ప్రవేశాలు చేసిన ఆసిఫాబాద్ జిల్లా కొరారి గ్రామంలో కేవలం 12 రోజుల వ్యవధిలోనే ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు. గృహ ప్రవేశాల నిమిత్తం జిల్లాకు విచ్చేసిన ముఖ్యమంత్రి 10 రోజులుగా జరుగుతున్న ఇంటి నిర్మాణపు పనులను పరిశీలించారు. ఆ రోజుకు షెటరింగ్ పనులు పూర్తి అయి కాంక్రీంట్ పోయడానికి సిద్ధం కాగా అటు తరువాత బుధవారం నాడు కాంక్రీట్ పోయగా, గురువారం సాయంత్రం డీ షెట్టరింగ్ చేయడం



జరిగిందని తెలిపారు. దాదాపు ఇంటికి సంబంధించిన సివిల్ పనులన్నీ పూర్తి కావడం జరిగిందని, త్వరగా ఇంటి నిర్మాణం పూర్తి అవుతుందన్న సాంకేతికతను చూసిన కొరారి వాసులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. మరో వారం రోజుల్లో ఫినిషింగ్ పనులు పూర్తి చేసుకుని గృహ ప్రవేశం చేసుకోవచ్చని తెలిపారు. ఇది ఆధునిక సాంకేత విప్లవమని, వేగవంతంగా 10 రోజుల్లోనే సొంత ఇంటిని నిర్మించుకునేందుకు మహత్తర అవకాశమని తెలిపారు.

## జిల్లా కాంగ్రెస్, నగర అధ్యక్ష పదవులకు దరఖాస్తులు చేసుకోవాలి

**మంచిర్యాల, జూన్ 05, ప్రభాతవార్త**

తెలంగాణ కాంగ్రెస్ మైనార్టీ విభాగం కార్యక్రమంలో భాగంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్, డిసిసి అధ్యక్షులు రఘునాథరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా కాంగ్రెస్, నగర కాంగ్రెస్ మైనార్టీ విభాగం అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా మైనార్టీ అధ్యక్షులు ఖాలిద్ తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని మైనార్టీ నాయకులు, ఆసక్తి గల ప్రతి ఒక్కరు అధ్యక్ష పదవుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా పరిశీలకులు ఎం ఏ లతీఫ్, వస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం ఆదివారం రోజు ఎం ఎం గార్డెన్ సీసీసీ నస్పూర్ యందు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు ఏదైనా వివరాల కోసం 9177999097 సంప్రదించాలని కోరారు.



## కనగర్తి గ్రామంలో విషాదం.. వ్యక్తి ఆకస్మిక మృతి

**మందమర్రి, జూన్ 05, ప్రభాతవార్త**



మందమర్రి మండల పరిధిలో ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై మందమర్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, కనగర్తి గ్రామానికి చెందిన మారం రామకృష్ణ (46) తన ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నాడు. జూన్ 5వ తేదీ ఉదయం రామకృష్ణకు స్నేహితులు పలుమార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించకపోవడంతో అనుమానం వ్యక్తం చేశారు. అనంతరం వారు స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడి బావమరిది సంపతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. రామకృష్ణకు గతంలో ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, ఇటీవల నెలకొన్న తీవ్ర ఎండల కారణంగా వడదెబ్బ తగిలి ఉండవచ్చని లేదా ఇతర అనారోగ్య కారణాలతో మృతి చెందిన ఉండవచ్చని ఫిర్యాదులో పేర్కొన్నట్లు వెల్లడించారు. మృతుడి మరణంపై కుటుంబ సభ్యులకు ఎలాంటి అనుమానాలు లేవని తెలిపారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా మృతికి గల ఖచ్చితమైన కారణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని, కేసుపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వాటర్ ట్యాంక్ ఎక్కి నిరసన

**జన్నారం, జూన్ 5, ప్రభాతవార్త**





ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ జన్నారం గ్రామ పంచాయతీ పరిధికి చెందిన కట్టెకోల రాములు శుక్రవారం వాటర్ ట్యాంక్ పైకి ఎక్కి నిరసన తెలిపారు. తాను ఎస్సీ దళిత కుటుంబానికి చెందిన నిరుపేదను అని, తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని రాములు డిమాండ్ చేశారు. పలుమార్లు దరఖాస్తు చేసుకున్నా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకున్నారు. రాములుతో మాట్లాడి అతని సమస్యను పరిశీలించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. పోలీసుల హామీతో రాములు వాటర్ ట్యాంక్ నుంచి కిందికి దిగి వచ్చాడు. అనంతరం గ్రామ సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో పోలీసులు చర్చించారు. రాములు దరఖాస్తును పరిశీలించి అర్హత ఉంటే మంజూరు చేయాలని సూచించారు. ఇలాంటి సమస్యలు ఉంటే నేరుగా అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని, ప్రాణాలకు హాని కలిగేలా నిరసనలు చేయవద్దని పోలీసులు సూచించారు.

## యోగతో శరీరానికి శక్తి.. మనసుకు ప్రశాంతత

### - ప్రతి ఒక్కరూ యోగ పట్ల ఆసక్తి పెంచుకోవాలి: లయన్స్ క్లబ్ ప్రతినిధులు

**మందమర్రి, జూన్ 05, ప్రభాతవార్త**

యోగ పట్ల ప్రతి ఒక్కరూ ఆసక్తి పెంచుకుని నిత్య జీవితంలో భాగంగా చేసుకోవాలని లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ సొత్తుకు సుదర్శన్, నర్సింగరావు సూచించారు. విలేజ్ మందమర్రిలోని రామాలయం సమీపంలో గత కొన్ని రోజులుగా నిర్వహిస్తున్న ఉచిత యోగ శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. యోగ సాధన ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని, అనేక రకాల శారీరక, మానసిక రుగ్మతలను అధిగమించవచ్చని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో యోగకు ఎంతో ప్రాధాన్యం ఉందని, ప్రతి వయస్సు వారు యోగాభ్యాసం చేయాలని పిలుపునిచ్చారు. ఈ నెల 10వ తేదీతో శిక్షణ కార్యక్రమం ముగియనున్న నేపథ్యంలో, శిక్షణలో పాల్గొన్న వారిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. విలేజ్ మందమర్రిలో నర్సింగరావు-ప్రణతి దంపతుల ఆధ్వర్యంలో మీనాక్షి యోగ, పిరమిడ్ ధ్యాన శిక్షణను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పూసాల వెంకటరత్నం, పోలు శ్రీనివాస్, జాకీర్, అనిత, లూథర్, ఆలయ పూజారి తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా విద్యాధికారిని మర్యాదపూర్వకంగా కలిసిన వ్యాయామ విద్య ఉపాధ్యాయులు

**మంచిర్యాల,జూన్ 5, ప్రభాతవార్త**

మంచిర్యాల జిల్లా నూతన జిల్లా విద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన లలితని జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి ఎం.డి. యాకూబ్, తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె. రామ్మోహన్ రావు, సిరంగి గోపాల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల శ్రీనివాస్, సంయుక్త కార్యదర్శి విఠల్, టీఎస్‌పీఈటీఏ జిల్లా అధ్యక్షులు రేణి రాజయ్య, కార్యవర్గ సభ్యులు పాశం శ్రీనివాస్, లింగయ్య తదితరులు పాల్గొన్నారు. జిల్లాలో క్రీడలు, వ్యాయామ విద్యాభివృద్ధికి జిల్లా విద్యాధికారి సహకారం అందించాలని ఈ సందర్భంగా వారు కోరగా, విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాధికారి లలిత తెలిపారు.



## మొక్కలు నాటుదాం.. ప్రకృతిని కాపాడుదాం

**వేమనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం నీల్వాయి, వేమనపల్లి గ్రామాల్లో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్‌లు చెన్నూరి సమ్మయ్య, వుప్పులపు సాయి కృష్ణ, నీల్వాయి అటవీ రేంజ్ అధికారి హఫీజొద్దీన్‌తో కలిసి పలు ప్రాంతాల్లో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సూచించారు. మొక్కలు మన జీవనాధారమని, పచ్చదనం పెంపొందించడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై జగదీష్ రెడ్డి, డీఆర్‌వో ప్రమోద్ కుమార్, రూపేష్, ఎఫ్‌బీఓ సుభాష్, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో ఫర్టిలైజర్స్ దుకాణాల తనిఖీ

**లక్షెట్టిపేట, జూన్ 05, ప్రభాతవార్త**



జిల్లా వ్యవసాయ అధికారి సురేఖ ఆధ్వర్యంలో మండల స్థాయి టాస్క్ ఫోర్స్ (వ్యవసాయ, రెవెన్యూ, పోలీస్) వారి ద్వారా విత్తనాలు, ఎరువుల ఫర్టిలైజర్స్ దుకాణాలలో ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది. శుక్రవారం రోజున తనిఖీల అనంతరం జిల్లా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ.. ప్రతి డీలర్ తప్పకుండా రికార్డ్స్ సరిగ్గా మెయింటైన్ చేయాలని, విధిగా విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసిన రైతులకి రసీదు ఇవ్వాలని, స్టాక్ బోర్డ్ కూడా అప్డేట్ చేయాలని తెలిపారు. రైతులందరికీ సరిపడా ప్రత్తి, వరి విత్తనాలను మార్కెట్లో అందుబాటులో ఉంచడం జరిగిందని తెలియజేశారు. యూరియా బుకింగ్ యాప్ త్వరలోనే రైతులకు అందుబాటులోకి వస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు, మంచిర్యాల మామిడి కృష్ణ, మండల తహసీల్దార్ దిలీప్ కుమార్, మండల వ్యవసాయ అధికారి రామగిరి శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న సర్పంచులు, అటవీ అధికారులు

# పచ్చదనం పథంలో సింగరేణి...

**- పచ్చని భవిష్యత్తుకు శ్రీకారం - నూతన ఏజెంట్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్**

**- కాసిపేట్2 గనిపై అద్భుతంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలు**






బెల్లంపల్లి, జూన్ 05, ప్రభాతవార్త

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ మందమర్రి ఏరియాలోని కాసిపేట్2 ఇన్‌క్లైన్ గనిపై ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని అత్యంత వైభవంగా, అర్థవంతంగా నిర్వహించారు. ప్రకృతి సంరక్షణకు నూతన దిశానిర్దేశం చేసేలా జరిగిన ఈ కార్యక్రమానికి మందమర్రి ఏరియా నూతన ఏజెంట్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి వేడుకలకు మరింత శోభ తీసుకువచ్చారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయనకు గని అధికారులు, సిబ్బంది, కార్మికులు ఘన స్వాగతం పలికి తమ అభినందనలు తెలిపారు.

## పర్యావరణ చైతన్యానికి నాంది - ప్రతిజ్ఞతో ప్రారంభం...

కార్యక్రమం ప్రారంభంలోనే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించేందుకు ఏజెంట్ ఖదీర్ కార్మికులు, అధికారులు కలిసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. ప్రకృతి రక్షణే మన భవిష్యత్తుకు భరోసా అనే సందేశంతో ప్రతి ఒక్కరూ పర్యావరణ సంరక్షణలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

## మొక్కల నాటకం - పచ్చని అడుగులు...

పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గని ప్రాంగణంలో విస్తృత స్థాయిలో మొక్కల నాటకం చేపట్టారు. ఈ సందర్భంగా ఏజెంట్ స్వయంగా మొక్కను నాటి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మొత్తం 110 మొక్కలను నాటి, వాటిని పరిరక్షించడం ప్రతి ఉద్యోగి, కార్మికుడి సామూహిక బాధ్యతగా ఆయన పేర్కొన్నారు. పచ్చని పరిసరాలు గనుల అభివృద్ధికి, కార్మికుల ఆరోగ్యానికి ఎంతో కీలకమని వివరించారు.

## సేఫ్టీకి ప్రథమ ప్రాధాన్యం... ఉత్పాదకతలో నూతన లక్ష్యాలు

తదనంతరం గని మేనేజర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఏజెంట్ ఖదీర్ మాట్లాడుతూ గనులలో సేఫ్టీ ప్రమాణాలను కట్టుదిట్టంగా అమలు చేయడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. అదే సమయంలో వ్యయ నియంత్రణ చర్యలను సమర్థవంతంగా అమలు చేస్తూ, బొగ్గు ఉత్పాదకతను పెంచేందుకు నూతన ఆలోచనలతో ముందుకు సాగాలని సూచించారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేస్తే లక్ష్యాలు సులభంగా సాధ్యమవుతాయని ఆయన పేర్కొన్నారు.

## నూతన ఏజెంట్ కు ఘన సన్మానం...

ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏజెంట్ మహ్మద్ అబ్దుల్ ఖదీర్ ను గని అధికారులు శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వంలో గని అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భూగర్భ గని తనిఖీ - ప్రత్యక్షంగా సమీక్ష...

సమావేశం అనంతరం ఏజెంట్ ఖదీర్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ, సేఫ్టీ ఆఫీసర్ రవిశంకర్ వర్మ తదితరులతో కలిసి భూగర్భ గనిలోకి వెళ్లి మైనింగ్ కార్యకలాపాలను స్వయంగా పరిశీలించారు. కార్మికుల భద్రతా చర్యలను క్షుణ్ణంగా సమీక్షించి, సురక్షిత విధానాల్లో ఉత్పత్తి పెంపు సాధించేందుకు అవసరమైన మార్గదర్శకాలను అందించారు. క్షేత్రస్థాయిలో ఇచ్చిన సూచనలు గని పనితీరుకు మరింత దోహదపడనున్నాయి. పెద్ద ఎత్తున పాల్గొన్న సిబ్బంది ఈ కార్యక్రమంలో కాసిపేట్2 ఇన్‌క్లైన్ ఎన్విరాన్మెంటల్ అధికారి సప్పిడి కృష్ణప్రసాద్, పిట్ కమిటీ ఉపాధ్యక్షుడు కొండపల్లి నర్సయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ భార్గవ్, ఇతర మైనింగ్ సిబ్బంది, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పచ్చని సంకల్పం - సుస్థిర అభివృద్ధి దిశగా అడుగులు...

ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టిన ఈ కార్యక్రమం ద్వారా పచ్చని పరిసరాల నిర్మాణం, సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనకు సింగరేణి సంస్థ కట్టుబడి ఉందని మరోసారి స్పష్టం అయింది.

# భవిత కేంద్రంలో దివ్యాంగుల నమోదు కార్యక్రమం



దిలావర్‌పూర్, జూన్ 05, ప్రభాతవార్త:

దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలున్న పిల్లల (దివ్యాంగుల) నూతన ప్రవేశాల కోసం ప్రత్యేక నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాధికారి (ఎంఈవో) సదానందం మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులు ఆత్మన్యూనతా భావాన్ని వీడి, చదువు ద్వారా సమాజంలో ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. భవిత కేంద్రాల్లో ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత విద్య, వైద్య, రవాణా వసతులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిత కేంద్రం ప్రత్యేక ఉపాధ్యాయులు రవి, దీపిక క్షేత్రస్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులకు కేంద్రంలో అందించే ఫిజియోథెరపీ, ప్రత్యేక బోధనా పద్ధతులు మరియు ప్రవేశాల వివరాలను క్షుణ్ణంగా వివరించి నమోదు ప్రక్రియను పూర్తి చేశారు. బడి వయస్సు గల ప్రత్యేక అవసరాలున్న పిల్లలందరినీ భవిత కేంద్రాల్లో చేర్పించి వారి భవిష్యత్తుకు బాటలు వేయాలని ఉపాధ్యాయులు సూచించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు గ్రామాల నుండి వచ్చిన దివ్యాంగ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రవేశాల కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పర్యావరణ పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యం అవసరం: ఎంపీఓ గోవర్ధన్



దిలావర్‌పూర్, జూన్ 05, ప్రభాతవార్త:

పర్యావరణ పరిరక్షణలో ప్రజలంతా భాగస్వాములు కావాలని మండల పంచాయతీ అధికారి గోవర్ధన్ పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం దిలావర్‌పూర్ మండలం మాడేగాం గ్రామంలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఇందులో భాగంగా ప్రజా పాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక గ్రామసభను కూడా ఏర్పాటు చేశారు. అనంతరం ఎంపీఓ గోవర్ధన్ గ్రామ పంచాయతీ కార్యాలయ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న శానిటైజేషన్ (పరిశుభ్రత) పనులను క్షేత్రస్థాయిలో సందర్శించి, పనుల నిర్వహణపై పంచాయతీ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడాలన్నారు. అనంతరం గ్రామంలో మొక్కలు నాటిన ఆయన, కేవలం మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



# తాళం వేసిన ఇంట్లో దొంగతనం

**- నాలుగు తులాల బంగారం, నగదు అపహరణ**

నేరడిగొండ, జూన్ 05, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో గురువారం అర్ధరాత్రి భారీ దొంగతనం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. నేరడిగొండకు చెందిన జహీర్ బోథ్ మండల కేంద్రంలోని తన అత్తగారింటికి ఓ శుభకార్యానికి వెళ్లాడు. ఇల్లాలు తాళం వేసి ఉండడాన్ని ఆసరాగా చేసుకున్న దుండగులు రాత్రి సమయంలో ఇంటి తాళాలు పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. అల్మారాలో దాచి ఉంచిన నాలుగు తులాల బంగారు ఆభరణాలతో పాటు 70 వేల రూపాయల నగదును దోచుకెళ్లారు. శుక్రవారం ఉదయం ఇంటికి తిరిగి వచ్చిన బాధితుడు తాళాలు పగలగొట్టి ఉండడం, ఇంట్లోని వస్తువులు చెల్లాచెదురుగా పడి ఉండడం చూసి దిగ్భ్రాంతికి గురయ్యాడు. బంగారంతో పాటు నగదు చోరీకి గురైనట్లు గుర్తించి తక్షణమే పోలీసులకు సమాచారం అందించాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీమ్ సహాయంతో ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న దుండగులను త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు పేర్కొన్నారు.



# పచ్చని భవిష్యత్తుకు నాంది

చింతలమానేపల్లి, జూన్ 5, ప్రభాతవార్త

గంగాపూర్, బాబాపూర్ పాఠశాలలు, జీపీ రవీంద్రనగర్‌లో ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కల నాటే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొని మొక్కలు నాటారు. అటవీ శాఖ అధికారుల సమన్వయంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ అవసరాన్ని వివరించారు. ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని సూచించారు. పచ్చదనమే భవిష్యత్తుకు భరోసా అని, మొక్కల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడవచ్చని అటవీ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరూ పర్యావరణ పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత

కౌటాల, జూన్ 5, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం నిరుపేద పేద, కుటుంబాలకు అండగా నిలుస్తోందని కాంగ్రెస్ నాయకులు అన్నారు. గౌరవ ఎమ్మెల్సీ దండే విఠల్ ఆదేశాల మేరకు తలోడి గ్రామానికి చెందిన నాగుల లక్ష్మీనారాయణకు రూ.60 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) చెక్కును అందజేశారు. సందర్భంగా లబ్ధిదారుడు నాగుల లక్ష్మీనారాయణ, కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేస్తూ, తమకు ఆర్థిక సహాయం అందించిన ముఖ్యమంత్రి మరియు ఎమ్మెల్సీ దండే విఠల్‌కు రుణపడి ఉంటామన్నారు. చెక్కు పంపిణీ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ సిడం గణపతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నీకోడే గంగారాం, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దుర్గం జానకిరావు, జిల్లా ఈసీ సభ్యుడు పారెపల్లి పోశం, తలోడి మాజీ సర్పంచ్ సత్తన్న, యాదవ సంఘం మండల అధ్యక్షుడు గట్టయ్య, జాడి రాంకుమార్, ఎల్లన్న, బాపు, గోడిసెల రవి, నరేష్, చిలుకయ్య, హన్మంతు తదితరులు పాల్గొన్నారు.



## నూతన జిల్లా ఇంఛార్జి విద్యాశాఖాధికారికి సీఐటీయు అభినందనలు

### - మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
### - దుంపల రంజిత్ కుమార్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి

మంచిర్యాల,జూన్ 5,ప్రభాతవార్త

మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో శుక్రవారం రోజున మంచిర్యాల జిల్లా డిఈఓగా బాధ్యతలు చేపట్టడంతో మధ్యాహ్న భోజనం సిఐటియు కార్మిక సంఘంగా అభినందనలు తెలుపడం అనంతరం జిల్లాలో మధ్యాహ్న భోజన కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పైన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దుంపల రంజిత్ కుమార్ సీఐటీయు కార్యదర్శి మాట్లాడుతూ,రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం 10,000 వేతనం చెల్లించాలన్నారు.అదే విధంగా పెరిగిన ధరలకు అనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలి, కోడి గుడ్డు, గ్యాస్ ను ఉచితంగా సరఫరా చేయాలన్నారు. దాసరి రాజేశ్వరి, ఎండి రఫియా యూనియన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం పాఠశాలల్లో విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం పెట్టాలని ఒత్తిడి తేవడంతో కార్మికులు పెట్టారుని, ప్రభుత్వం మాత్రం నిధులు విడుదల చేయలేదని,దింతో కార్మికులు అల్పాహారం పెట్టినవాళ్ళకు ఒక ఒక్కరికి 30 వేల నుండి 50 వేల వరకు నష్టపోయారని, గత ప్రభుత్వం విధంగా కాకుండా ముందుగా కాంగ్రెస్ రాష్ట్ర ప్రభుత్వం మెనూ చార్జీలు పెంచాలని, అందరికి ఐడి కార్డులు యూనిఫామ్‌లు ఇవ్వాలని, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీమా, మధుణమ్మ, సరిత, బుచ్చమ్మ, రబియా తదితరులు పాల్గొన్నారు.

## మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు సంకల్పం

### - కేకే ఓసీలో ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం

మందమర్రి, జూన్ 5, ప్రభాతవార్త

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి కేకేఓసీ ఆవరణలో భారీ స్థాయిలో మొక్కల నాటకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనాన్ని పెంపొందించడం లక్ష్యంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో అటవీ శాఖ అధికారులు, కేకేఓసీ ప్రతినిధులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంచిర్యాల జిల్లా అటవీ శాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, ఐఎఫ్ఎస్ తొలి మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించేందుకు, భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా సమాన బాధ్యత అని అన్నారు. మంచిర్యాల ఫారెస్ట్ డివిజనల్ అధికారి సర్వేశ్వర్ రావు మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో అడవుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా అటవీ విస్తీర్ణాన్ని పెంచి పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. ఫారెస్ట్ రేంజ్ అధికారి రత్నాకర్ మాట్లాడుతూ ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా కేకేఓసీ ప్రాంగణంలో సామూహిక వనమహోత్సవం నిర్వహించడం అభినందనీయమన్నారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో కేకేఓసీ జీఎం జి.ఎల్. ప్రసాద్, ఎన్విరాన్మెంట్ ఆఫీసర్ వెంకటరెడ్డి, ఫారెస్ట్ ఆఫీసర్ నవీన్, ఇతర ఉన్నతాధికారులు, అటవీ శాఖ సిబ్బంది, కేకేఓసీ ప్రతినిధులు పాల్గొని వివిధ రకాల నీడనిచ్చే, పండ్ల మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.



# ప్రకృతిని ప్రేమించండి.. పర్యావరణాన్ని పరిరక్షించండి

### - కమిషనర్ రాజలింగు - 100 మొక్కలతో పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం

మందమర్రి, జూన్ 5, ప్రభాతవార్త




ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మందమర్రి మున్సిపాలిటీ కార్యాలయ ప్రాంగణంలో గురువారం 100 మొక్కలను నాటారు. మున్సిపల్ కమిషనర్ తుంగపిండి రాజలింగు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రాజలింగు మాట్లాడుతూ, సమస్త జీవరాశుల మనుగడకు ప్రకృతే మూలాధారమని పేర్కొన్నారు. రోజురోజుకు పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం, కాలుష్యం పర్యావరణ సమతుల్యతకు తీవ్రమైన ముప్పుగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. అడవుల నరికివేతను అరికట్టడంతో పాటు విస్తృత స్థాయిలో మొక్కలు నాటి వాటిని సంరక్షించడం ద్వారా భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించవచ్చని ఆయన అన్నారు. ప్రకృతిని ప్రేమించండి – పర్యావరణాన్ని రక్షించండి. మనం ప్రకృతికి చేసే మేలు వంద రెట్లు తిరిగి మనకే లభిస్తుంది. మన కోసం మాత్రమే కాకుండా భావితరాల భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలి అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆఫీసర్ పి. కృష్ణ ప్రసాద్, మేనేజర్ టి. రాజేశ్వరి, టీపిబీఓలు మనోజ్, సాయి నిచల్, రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్లు ఏ. రాణి, ఈ. రాజేశ్వరి, జూనియర్ అసిస్టెంట్లు ఈ. వసంత్, విమల రాణి, పున్నం చందర్, బి. ప్రదీప్, వినయ్ శామ్యూల్, సి.హెచ్. ప్రదీప్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, ఎన్విరాన్మెంటల్ ఇంజనీర్ ఎం. గోపి కృష్ణ, సిస్టమ్ మేనేజర్ ఎ. శిరీష్, డేటా ప్రాసెసింగ్ ఆఫీసర్ బి. శ్యాంబాబు తదితర మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య

మందమర్రి, జూన్05, ప్రభాతవార్త



మంచిర్యాల జిల్లా మందమర్రి మండలంలోని సండ్రపల్లి గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విషాదాన్ని నింపింది. ఈ ఘటనపై మందమర్రి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సండ్రపల్లి గ్రామానికి చెందిన ఏదుల రాజ్‌కుమార్ (28) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మద్యానికి బానిసైన రాజ్‌కుమార్ కుటుంబంలో తలెత్తిన సమస్యల కారణంగా కొంతకాలంగా తీవ్ర మనస్తాపానికి గురైనట్లు సమాచారం. గురువారం రాత్రి భోజనం చేసిన అనంతరం ఇంటి నుంచి బయటకు వెళ్లిన రాజ్‌కుమార్ తిరిగి ఇంటికి రాలేదు. శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని ఓ వేప చెట్టుకు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్థులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి తల్లి ఏదుల లస్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు మందమర్రి ఎస్సై జి. నరేష్ తెలిపారు. ఈ ఘటన గ్రామంలో విషాద ఛాయలు అలుముకునేలా చేసింది.



## పర్యావరణాన్ని కాపాడాలంటే ఇంటికొక మొక్కను నాటాలి

### - చెన్నూరు మున్సిఫ్ కోర్టు జడ్జి రవికుమార్

చెన్నూరు, జూన్ 5, ప్రభాతవార్త

భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన పర్యావరణాన్ని అందివ్వాలంటే ప్రతి ఒక్కరు తమ ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలు నాటి, వాటిని సంరక్షించాలని చెన్నూర్ మున్సిఫ్ కోర్టు జడ్జి రవికుమార్ కోరారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని శుక్రవారం అటవీ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక మున్సిఫ్ కోర్టు ఆవరణలో జడ్జి రవి కుమార్, ఎఫ్‌డిఓ సర్వేశ్వర్‌లు కలిసి మొక్కలు నాటారు.

## ఘనంగా శ్రీ మధురం స్వీట్ హౌస్ ప్రారంభం

మంచిర్యాల, ప్రభాతవార్త



మంచిర్యాల నగరంలోని మార్కెట్ నందు ఎలా ఏర్పాటు చేసిన శ్రీ మధురం స్వీట్ హౌస్ శుక్రవారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన నగర మేయర్ ధరణి మధూకర్, నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తూముల నరేష్ స్వీట్ హౌస్‌ను ప్రారంభించి నిర్వాహకులు ప్రొద్దుటూరి శ్రీశైలం కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ ధరణి మధుకర్ మాట్లాడుతూ, మంచిర్యాల పట్టణంలో నాణ్యమైన ఆహార ఉత్పత్తులు, స్వచ్ఛమైన మిఠాయిలను ప్రజలకు అందించాలనే లక్ష్యంతో ప్రారంభమైన శ్రీ మధురం స్వీట్ హౌస్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తూ వ్యాపార రంగంలో ముందుకు వస్తున్న యువ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం ఆనందంగా ఉందన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు తూముల నరేష్ మాట్లాడుతూ, వినియోగదారుల విశ్వాసాన్ని పొందాలంటే నాణ్యత, పరిశుభ్రత, వినయపూర్వక సేవలు అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ప్రజల ఆదరణతో ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించగా, వ్యాపారవేత్తలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, స్థానిక ప్రముఖులు, వ్యాపారులు, ఓం అష్టోత్తర యోగా పిట్ సభ్యులు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కొత్తగా ప్రారంభమైన శ్రీ మధురం స్వీట్ హౌస్‌లో వివిధ రకాల సంప్రదాయ మిఠాయిలు, హాట్ స్నాక్స్, బేకరీ ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని నిర్వాహకులు శ్రీశైలం తెలిపారు. కార్యక్రమం అనంతరం అతిథులకు స్వీట్లు అందజేసి సత్కరించారు. పట్టణ ప్రజల నుంచి శ్రీ మధురం స్వీట్ హౌస్‌కు మంచి స్పందన లభించింది.

## గొర్లపల్లిలో 6 చేతిపంపుల పనుల ప్రారంభం

వేమనపల్లి, జూన్ 5, ప్రభాతవార్త



మండలంలోని గొర్లపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని కొత్త కాలనీలో తాగునీటి సమస్య పరిష్కారానికి మంజూరైన 6 చేతి పంపుల పనులను శుక్రవారం మాజీ జడ్పీటీసీ సభ్యులు ఆర్. సంతోష్ కుమార్, స్థానిక సర్పంచ్ కొట్రంగి శ్రీనివాస్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంతోష్ కుమార్ మాట్లాడుతూ ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి సహకారంతో గ్రామాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. ఈ చేతి పంపుల ద్వారా గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తగ్గనున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ జనరల్ సెక్రటరీ గాలి మధు, చెన్నూరి సమ్మయ్య, మడే శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## బెల్లంపల్లిలో త్రాగునీటి కొరత

**బెల్లంపల్లి, జూన్ 05, ప్రభాతవార్త**

బెల్లంపల్లి పట్టణంలో త్రాగునీటి సమస్య తీవ్రంగా మారింది. ఆడా ప్రాజెక్టు ద్వారా సరఫరా చేయాల్సిన త్రాగునీరు మూడు రోజులకోసారి మాత్రమే అందుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికే వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు అధికంగా ఉండటంతో, కనీసం రెండు రోజులకోసారి నీటి సరఫరా జరగాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నీటి సరఫరా సరిగా లేకపోయినా, బిల్లుల వసూళ్లలో మాత్రం అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. త్రాగునీరు అందించకుండా బిల్లులు వసూలు చేయడం అన్యాయమని వారు మండిపడుతున్నారు. నీటి కొరత ఉన్న వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా త్రాగునీరు సరఫరా చేయాల్సిన బాధ్యత మున్సిపాలిటీపై ఉన్నప్పటికీ, ఆ చర్యలు కూడా కనిపించడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ముఖ్యంగా మున్సిపల్ కమిషనర్ బాధ్యత తీసుకుని దినం విడిచి దినం త్రాగునీటి సరఫరా చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో స్థానిక ప్రజలను సమీకరించి మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరిస్తున్నారు. ఈ ఆందోళనకు సంబంధించిన పూర్తి బాధ్యత అధికారులదేనని ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అంబాల మహేందర్ ఒక ప్రకటనలో తెలియజేశారు.



## స్వచ్ఛ గ్రామ్ - సురక్షిత జలవాయు పథకానికి శ్రీకారం

### సారంగపల్లి, శంకర్‌పల్లిలో హరితహారం కార్యక్రమం

**మందమర్రి, జూన్ 05, ప్రభాతవార్త**

మందమర్రి మండలంలోని సారంగపల్లి, శంకర్‌పల్లి గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛ గ్రామ్ – సురక్షిత జలవాయు పథకం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, సారంగపల్లి సర్పంచ్ రాములు ముఖ్య అతిథులుగా పాల్గొని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తగ్గించేందుకు మొక్కల పెంపకం ఎంతో అవసరమని, ప్రతి గ్రామంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు ప్రజలు ముందుకు రావాలని సూచించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటిని సంరక్షించడం కూడా సమానంగా ముఖ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, ఏపీఓ, అటవీ శాఖ సెక్షన్ ఆఫీసర్, బీట్ ఆఫీసర్, వార్డు సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## హెచ్పిఎస్లో జిల్లా నుంచి విద్యార్థి ఎంపిక

**ఆసిఫాబాద్, జూన్ 5, ప్రభాతవార్త**

2026–27 విద్యా సంవత్సరమునకు గాను బేగంపేట్‌లోని హైదారాబాద్ పబ్లిక్ స్కూల్ లో జిల్లా నుంచి ఒక విద్యార్థిని లక్కీ డ్రా ద్వారా ఎంపిక చేసినట్లు కలెక్టర్ హరిత పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని సమావేశం మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1వ తరగతి ప్రవేశమునకు సంబంధించి (12) ధరఖాస్తులు రావడం జరిగిందన్నారు. అర్హత కలిగిన (10) ధరఖాస్తుల్లో లక్కి డ్రాలో దుప్త అనిరుద్ జాయ్ ఎంపిక కాగా, దొంగ్రే హన్ష్ వచన్‌ను ప్రథమ వెయిటింగ్ లిస్టుగా, దగమ శ్రినిషిను రెండో వెయిటింగ్ లిస్టుగా ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ అధికారి, సిబ్బంది పాల్గొన్నారు.



లక్కీడ్రా తీస్తున్న కలెక్టర్ హరిత

# అనుమతి లేకుండా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు

### - జిల్లా కలెక్టర్ కె. హరిత

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 5, ప్రభాతవార్త :**

జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. శుక్రవారం జిల్లాలోని కాగజ్ నగర్ మండలంలోని కొత్తసార్సాలా గ్రామం వద్ద సార్సాలా వాగు నుండి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సరైన అనుమతులు లేకుండా వాగుల నుండి ఇసుకను తరలించడం, చెరువుల నుండి మట్టిని తరలించడం చేస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఏప్రిల్ 1వ తేదీ నుండి మన ఇసుక వాహనం యాప్ ప్రారంభించిందని, ఇసుకను తరలించే వారు యాప్ లో స్లాట్ బుక్ చేసుకుని అనుమతి తీసుకోవాలని, సరైన అనుమతి లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ట్రాక్టర్ల డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



ట్రాక్టర్లను నిలిపి అనుమతి పత్రాల వివరాలు తెలుసుకుంటున్న జిల్లా కలెక్టర్



## ఘనంగా పర్యావరణ దినోత్సవం

**సారంగాపూర్, జూన్ 05, ప్రభాతవార్త:**

మండలంలో శుక్రవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని అన్ని గ్రామాల్లో ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సర్పంచులు, ప్రజాప్రతినిధులు, నాయకులు ఆయా గ్రామ పంచాయతీల ఆవరణల్లో, ఖాళీ స్థలాల్లో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మానవ మనుగడకు మొక్కలు ఎంతో అవసరమని, అవి మనకు ప్రాణవాయువైన ఆక్సిజన్‌ను అందిస్తాయని పేర్కొన్నారు. పర్యావరణాన్ని పరిరక్షి ంచి, మొక్కలను పెంచడం ద్వారానే భావితరాలు ఆయురారోగ్యాలతో జీవించడానికి వీలవుతుందని తెలిపారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా మొక్కలను నాటడమే కాకుండా, వాటిని సంరక్షి ంచి ప్రకృతిని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. వర్షాకాలం ప్రారంభం కానున్న నేపథ్యంలో ప్రతి ఇంటి ఆవరణలోనూ మొక్కలు నాటి గ్రామాలను పచ్చదనంతో నింపాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, వివిధ పార్టీల నాయకులు, పంచాయతీ సిబ్బంది, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## మొక్కలు నాటండి పర్యవరణాన్ని కాపాడండి

**కెరమెరి, జూన్ 5, ప్రభాతవార్త**

పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యవరణానికి కాపాడాలని ఎఫ్ ఆర్ ఓ మజారుద్దీన్ అన్నారు శుక్రవారం కెరమెరి సర్పంచ్ ఆనంద్ రావు తో కలిసి ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా అటవీ శాఖ ఆధ్వర్యంలో కెరమెరి ఘాట్లో ఏర్పాటు చేసిన మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీ శాఖ అధికారులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీ పి టిఆర్వో జమీర్, అటవీ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పచ్చని భవిష్యత్తుకు

## సింగరేణి సంకల్పం

### - మందమర్రి జీఎం కార్యాలయం, కేకే ఓసీపీలో ఘనంగా పర్యావరణ దినోత్సవ వేడుకలు

**మందమర్రి, జూన్ 05, ప్రభాతవార్త**

సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సంస్థ పర్యావరణ పరిరక్షణలో తన కట్టుబాటును మరోసారి చాటుకుంది. సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఆదేశాలు, దిశానిర్దేశాల మేరకు మందమర్రి ఏరియా లోని జనరల్ మేనేజర్ కార్యాలయం మరియు కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్టులో ప్రపంచ పర్యావరణ దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.

### పర్యావరణ చైతన్యానికి ప్రతిజ్ఞ జీఎం కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం...

జీఎం కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్ కార్యాలయ ప్రాంగణంలో ఉద్యోగులు, అధికారులతో కలిసి పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ నాయకత్వంలో పర్యావరణ పరిరక్షణకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. మారుతున్న వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి ఉద్యోగి పర్యావరణాన్ని కాపాడే బాధ్యతను స్వీకరించాలని సూచించారు. 2026 సంవత్సరానికి ప్రపంచ పర్యావరణ దినోత్సవ థీమ్ అయిన ప్రకృతి స్ఫూర్తితో.. వాతావరణం కోసం.. మన భవిష్యత్తు కోసం అనే సందేశాన్ని గుర్తుచేస్తూ, మొక్కల నాటకం, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని పిలుపునిచ్చారు. సింగరేణిని పర్యావరణహిత సంస్థగా తీర్చిదిద్దడం మన లక్ష్యం. భవిష్యత్తు తరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించడం మన అందరి బాధ్యత అని ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్ అన్నారు. కేకే ఓసీపీలో పచ్చదనం పండుగ ఇదే స్ఫూర్తితో కేకే ఓపెన్ కాస్ట్ ప్రాజెక్ట్ లో కూడా పర్యావరణ దినోత్సవ వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఇన్‌ఛార్జ్ జీ.ఎం జి.ఎల్. ప్రసాద్, ఏరియా పర్యావరణ అధికారి వెంకటరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై సిబ్బందితో కలిసి పర్యావరణ ప్రతిజ్ఞ చేయించారు. గని పరిసరాల్లో మొక్కలు నాటి పచ్చదనానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో వెంకటరెడ్డి ఏరియా పర్యావరణ అధికారి, సత్యనారాయణ సీనియర్ పర్సనల్ ఆఫీసర్, సరిత డిప్యూటీ ఎఫ్.ఎమ్ (అకౌంట్స్), రమణ ఏఐటీయూసీ జీఎం స్ట్రక్చర్ కమిటీ సభ్యుడు, గీతిక ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ. కేకే ఓసీపీ పరిధిలో వెంకటవంశీధర్ ప్రాజెక్ట్ ఇంజనీర్, రామరాజు మేనేజర్, శ్రీధర్ గౌడ్ పర్యావరణ అధికారి, కుమారస్వామి ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ, సందీప్ వెల్ఫేర్ ఆఫీసర్, సూపర్‌వైజర్లు, కార్మిక సంఘాల నాయకులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణతోనే మానవాళి మనుగడ సాధ్యం

**- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత**




నస్పూర్, జూన్ 5, ప్రభాతతవార్త

ఈ భూమి మనకు ఆస్తి కాదు, మన పిల్లల నమ్మకం.. ఒక మొక్క నాటితే రేపటి తరానికి ఊపిరిని ఇచ్చినట్లవుతుందని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎస్. అనిత పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మంచిర్యాల జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొని బ్యానర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు పడిన వెంటనే జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాల పరిధిలో పర్యావరణంపై దృష్టి పెట్టి మొక్కలు నాటాలని ఆదేశించారు. ప్రతిచోట పచ్చదనం, పరిశుభ్రతను పాటించాలని, మొక్కల ద్వారా ప్రకృతిని కాపాడుకుంటూ వచ్చే తరాలకు మంచి వాతావరణాన్ని అందించడానికి చర్యలు చేపట్టాలని డాక్టర్ అనిత కోరారు. దైనందిన జీవన శైలిలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలన్నారు. అవసరం లేని ప్రయాణాలను తగ్గించుకోవడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని అరికట్టవచ్చని, దగ్గర ప్రాంతాల్లో పనులను నడక ద్వారా పూర్తి చేయాలని సూచించారు. అనవసరమైన ప్యాకెట్ ఫుడ్, జంక్ ఫుడ్, మైదా, కూల్ డ్రింకుల వాడకాన్ని తగ్గించుకోవాలని, వీటివల్ల ఆరోగ్యంతో పాటు పర్యావరణం కూడా పాడవుతుందని హెచ్చరించారు. మానవ ఆరోగ్యంలో పర్యావరణం ముఖ్యమైన పాత్ర పోషిస్తుందని, అందుకే వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడంతో పాటు నడక, యోగాను అలవర్చుకోవాలని అనిత పిలుపునిచ్చారు. అనవసరమైన వస్తువులను దూరం చేస్తూ, చెట్లు నాటి ప్రకృతిని కాపాడాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ప్రసాద్, జిల్లా మాస్ మీడియా అధికారి బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు. అసంక్రమణ వ్యాధుల కోఆర్డినేటర్ కాకిరాల వెంకటేశ్వర్లు, లక్ష్మణస్వామి, శ్రీనివాస్, ఆర్‌ఎస్ పద్మ, వసుమతి, రవి కిరణ్, సురేందర్, ఇతర వైద్య సిబ్బంది పాల్గొని పర్యావరణ పరిరక్షణకు సంఘీభావం తెలిపారు.

## అధికారి వేధింపులతోనే ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి శ్రీధర్ బాబు ఆత్మహత్య

**- జేఏసీ ధ్వజం**

నిర్మల్, జూన్ 05, ప్రభాతవార్త:

రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ గిరిజన సంక్షేమ శాఖలో ఔట్‌సోర్సింగ్ డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న వాడ్య శ్రీధర్ బాబు విషాద మరణం పట్ల నిర్మల్ జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తీవ్ర ఆవేదన, దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. శ్రీధర్ బాబు ఆత్మహత్యకు నిరసనగా శుక్రవారం నిర్మల్ జిల్లా కలెక్టరేట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఏసీ జిల్లా అధ్యక్షులు రాహుల్ రాజ్, జనరల్ సెక్రెటరీ వినోద్ కుమార్ సంయుక్తంగా మాట్లాడుతూ మృతుడి భార్య ఫిర్యాదు ప్రకారం కార్యాలయ సంబంధిత వేధింపులు, తీవ్ర మానసిక ఒత్తిళ్లే ఈ దారుణ ఘటనకు కారణమని ఆరోపించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి ఈ ఘటనపై ఉన్నత స్థాయి నిష్పక్షపాత విచారణ జరిపించి వాస్తవాలను వెలికితీయాలని డిమాండ్ చేశారు. విధుల్లో వేధింపులకు గురిచేసి ఆత్మహత్యకు ప్రేరేపించిన బాధ్యులైన అధికారులపై కఠిన శాఖాపరమైన, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కుటుంబ పోషకుడిని కోల్పోయి వీధిన పడిన మృతుడి కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయంగా 10 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందించాలని, దాంతో పాటు కుటుంబంలో ఒక అర్హునికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి మానవతా దృక్పథంతో ఆదుకోవాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో, వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులపై కొందరు అధికారుల వేధింపులు, మానసిక ఒత్తిళ్లు రోజురోజుకూ మితిమీరిపోతున్నాయని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి చర్యలను అరికట్టేందుకు ప్రభుత్వం వెంటనే ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేయాలన్నారు. ఉద్యోగుల సమస్యల తక్షణ పరిష్కారం కోసం జిల్లా స్థాయిలో ఒక ప్రత్యేక ఫిర్యాదు పరిష్కార కమిటీని ఏర్పాటు చేయాలని, తద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ గౌరవప్రదమైన, భద్రమైన పని వాతావరణం కల్పించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కోరారు. శ్రీధర్ బాబు కుటుంబానికి న్యాయం జరిగేలా తక్షణ చర్యలు తీసుకోవాలని నిర్మల్ జిల్లా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ తరపున స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలువురు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.





## దివ్యాంగుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

**- కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య**

నిర్మల్, జూన్ 05, ప్రభాతవార్త:

దివ్యాంగుల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని రాష్ట్ర దివ్యాంగుల కార్పొరేషన్ చైర్మన్ ముత్తినేని వీరయ్య అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన దివ్యాంగుల సహాయ ఉపకరణాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ వీరయ్య మాట్లాడుతూ దివ్యాంగులు సొంత కాళ్లపై నిలబడేలా ప్రభుత్వం అన్ని విధాలా సహకారం అందిస్తోందని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా దివ్యాంగుల కోసం ప్రత్యేకంగా స్వయం సహాయక సంఘాలను ఏర్పాటు చేశామని, ప్రస్తుతం 11 వేల దివ్యాంగ పొదుపు సంఘాల ద్వారా సుమారు 80 వేల మంది దివ్యాంగులు ఆర్థికంగా లబ్ధి పొందుతున్నారని వివరించారు. సహాయ ఉపకరణాల పంపిణీలో గతంలో ఉన్న కఠిన నిబంధనలను సవరించడం వల్ల మరింత మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరుతోందని చెప్పారు. అంతేకాకుండా ఆరు సంవత్సరాల లోపు వయసున్న దివ్యాంగ చిన్నారుల ఆరోగ్య సంరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా బాల భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా మాట్లాడుతూ దివ్యాంగుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక అవకాశాలు కల్పిస్తోందని అన్నారు. ప్రభుత్వం ఉచితంగా స్కూటీలు, అడ్వాన్స్డ్ వీల్‌చైర్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, వినికిడి యంత్రాలు వంటి ఆధునిక పరికరాలను అందజేస్తోందని తెలిపారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా అర్హులైన పలువురు దివ్యాంగులకు చైర్మన్ వీరయ్య, కలెక్టర్ భవేశ్ మిశ్రా చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ ఫోన్లు, అడ్వాన్స్డ్ వీల్‌చైర్లను పంపిణీ చేశారు. అనంతరం కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్‌తో కలిసి 38 మంది దివ్యాంగ లబ్ధిదారులకు ప్రత్యేకంగా రూపొందించిన మూడు చక్రాల మోటరైజ్డ్ స్కూటీలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు, దివ్యాంగుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి వినూత్న, వివిధ శాఖల అధికారులు, పెద్ద సంఖ్యలో దివ్యాంగులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## అగ్నివీర్ ఉద్యోగాలు సాధించిన యువకులకు సన్మానం చేసిన మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి

భైంసా, జూన్ 05, ప్రభాతవార్త:

దేశ రక్షణ సేవలో యువకుల పాత్ర అత్యంత కీలకమని ముథోల్ మాజీ శాసనసభ్యులు జీవీ విఠల్‌రెడ్డి అన్నారు. భైంసా పట్టణ కేంద్రానికి చెందిన ఐదుగురు యువకులు ఆకాష్, కార్తీక్, వంశీ, మణికంఠ, రోహన్ ఇటీవల విడుదలైన ఫలితాల్లో అగ్నివీర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా శుక్రవారం భైంసా పట్టణంలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. దేశ సేవకు ఎంపికైన యువకులను తీర్చిదిద్దిన వారి తల్లిదండ్రులకు కూడా ఈ సందర్భంగా ఆయన ప్రత్యేక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ యువకులు ఉద్యోగాలు సాధించడంలో భైంసా పట్టణానికి చెందిన ఐక్యత సేవా సమితి అధ్యక్షుడు యోగేష్ కీలక పాత్ర పోషించారని, వారికి దగ్గరుండి ఉచిత శిక్షణ ఇస్తూ ఎన్నో సహాయ సహకారాలు అందించారని మాజీ ఎమ్మెల్యే కొనియాడారు. ఈ మేరకు యోగేష్‌ను కూడా శాలువాతో ఘనంగా సన్మానించి అభినందించారు. పట్టణంలోని మరికొంత మంది యువకులు వీరిని స్ఫూర్తిగా తీసుకుని దేశ రక్షణ రంగంలో స్థిరపడాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ డైరెక్టర్ తోట రాము, సూర్యనారాయణ, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, ఏఎంసీ డైరెక్టర్ కిష్టన్న, ఒలా మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, రాజేందర్, దేగాం గ్రామ వార్డు సభ్యులు, వీడీసీ అధ్యక్షుడు నాని, మున్సిపల్ కౌన్సిలర్లు, నాయకులు, యువకుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## బదిలీలు సాధారణమే.. సేవలే శాశ్వతం

**- డిప్యూటీ సీఈవో దుర్గం శంకర్**

దిలావర్‌పూర్, జూన్ 05, ప్రభాతవార్త:

ఉద్యోగ జీవితంలో బదిలీలు సర్వసాధారణమైనవే అయినప్పటికీ, ఉద్యోగులు ప్రజలకు అందించిన సేవలే చిరస్మరణీయంగా నిలిచిపోతాయని జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో దుర్గం శంకర్ పేర్కొన్నారు. శుక్రవారం దిలావర్‌పూర్ మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బదిలీపై వెళ్లనున్న, నూతనంగా విధుల్లో చేరిన ఉద్యోగులకు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తిస్తూ ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. విధి నిర్వహణలో నిజాయితీ, క్రమశిక్షణ, సేవాభావం ఉంటే ఎక్కడ పనిచేసినా మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. మంచితనంతో విధులు నిర్వహిస్తూ నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రతి ఒక్కరికీ సహాయ సహకారాలు అందిస్తూ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తించాలని కోరారు. అనంతరం ఎంపీడీవో అరుణ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి తన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ కార్యాలయ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. బదిలీపై వెళ్లనున్న ఉద్యోగులు మండల అభివృద్ధికి విశేష కృషి చేశారని, వారి సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. అనంతరం ఎంపీఓ గోవర్ధన్ మాట్లాడుతూ బదిలీపై వెళ్లనున్న ఉద్యోగులు తమ బాధ్యతలను అత్యంత చక్కగా నిర్వర్తించి ప్రజల మన్ననలు పొందారని ప్రశంసించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లనున్న ఉద్యోగులు మాట్లాడుతూ దిలావర్‌పూర్ మండలాన్ని వీడి వెళ్లడం బాధాకరంగా ఉన్నప్పటికీ, ఇక్కడ పనిచేసిన అనుభవం తమకు ఎంతో విలువైనదని పేర్కొన్నారు. విధి నిర్వహణలో తమకు సహకరించిన ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బందికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం బదిలీపై వెళ్లనున్న ఉద్యోగులను, నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఉద్యోగులను అధికారులు ఘనంగా శాలువాలు కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



## కాగజ్‌నగర్ మండలంలో ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

- 22 ప్రభుత్వ పాఠశాల్లో ప్రీ-ప్రైమరీ తరగతుల ప్రారంభం
- జూన్ 9 వరకు దరఖాస్తులకు అవకాశం
- మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 5, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ మండలంలోని 22 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో 2026-27 విద్యా సంవత్సరం నుంచి ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో ఆయా, ఇన్‌స్ట్రక్టర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి వాసాల ప్రభాకర్ తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన అభ్యర్థులు జూన్ 5 నుంచి జూన్ 9 వరకు సంబంధిత పాఠశాలల్లో నిర్ణీత దరఖాస్తు ఫారంతో పాటు అవసరమైన ధ్రువపత్రాలను సమర్పించాలని సూచించారు. అభ్యర్థుల ఎంపికలో ముందుగా సంబంధిత ఆవాసం (వార్డు), గ్రామానికి చెందిన వారికి ప్రాధాన్యం ఇవ్వబడుతుందని, అనంతరం మండలంలోని ఇతర గ్రామాల అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. ఇన్‌స్ట్రక్టర్ పోస్టుకు కనీసం ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఆయా పోస్టుకు కనీసం 7వ తరగతి ఉత్తీర్ణత అర్హతగా నిర్ణయించారు. అభ్యర్థులు స్థానిక నివాసులై ఉండటంతో పాటు విద్యార్హతల మెమోలు, నివాస ధ్రువీకరణ పత్రాలు తదితర జిరాక్స్ ప్రతులను గెజిటెడ్ అధికారితో అటెస్టేషన్ చేయించి దరఖాస్తుకు జత చేయాలని పేర్కొన్నారు. అభ్యర్థుల తుది ఎంపిక జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించబడుతుందని మండల విద్యాధికారి తెలిపారు.

### ప్రీప్రైమరీ తరగతులు మంజూరైన పాఠశాలలు..

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హరిజనవాడ, ఎంపీపీఎస్ బాబునగర్, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గంగారాంబస్తీ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నవగాంబస్తీ, ఎంపీపీఎస్ రిక్షా కాలనీ, ఎంపీపీఎస్ బోరిగాం, ఎంపీయూపీఎస్ కడంబా, ఎంపీయూపీఎస్ ఈస్గాం, ఎంపీపీఎస్ నామానగర్, ఎంపీపీఎస్ జీడిచెను, ఎంపీపీఎస్ భట్టుపల్లి, ఎంపీపీఎస్ బలగాల, ఎంపీపీఎస్ జవ్వాజిగూడ, ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల నజ్రుల్‌నగర్ విలేజ్ నెం.3, నెం.5, నెం.10, నెం.13, ఎంపీపీఎస్ కోసిని, ఎంపీపీఎస్ సిర్‌సిల్క్, ఎంపీపీఎస్ డాడానగర్, ఎంపీపీఎస్ కొత్త అనుకోడ, ఎంపీయూపీఎస్ బోడేపల్లి పాఠశాలలు. అర్హత గల అభ్యర్థులు ఈ నెల 9వ తేదీలోపు సంబంధిత పాఠశాలల్లో దరఖాస్తులు సమర్పించాలని అధికారులు సూచించారు.

## మండలంలోని అన్ని గ్రామాల్లో గ్రామసభలు

### పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత

**సారంగాపూర్, జూన్ 05, ప్రభాతవార్త:**

మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. ఇందులో భాగంగా జాం గ్రామపంచాయతీలో సర్పంచ్ కరిపే రవళి విలాస్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన గ్రామసభకు జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీనివాస్, డీఎల్పీఓ లక్ష్మణ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్, ఎంపీఓ అజీజ్ ఖాన్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డీపీఓ శ్రీనివాస్ మాట్లాడుతూ నూతనంగా అమల్లోకి వచ్చిన ఘన వ్యర్థాల నివారణ నియమాలు 2026 గురించి గ్రామస్థులకు సమగ్రంగా వివరించారు. గ్రామాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. అనంతరం సభకు హాజరైన వారందరితో పర్యావరణ పరిరక్షణ ప్రతిజ్ఞ చేయించారు. ప్లాస్టిక్ నివారణపై అవగాహన కల్పిస్తూ ప్రజలకు జ్యూట్ (జనపనార) బ్యాగులను పంపిణీ చేశారు. గ్రామంలోని స్థానిక మార్కెట్ ప్రాంతంలో, ప్రధాన కూడళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన డస్ట్ బిన్ లను అందుబాటులోకి తెచ్చారు. ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరిట ఒక మొక్క) కార్యక్రమంలో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి ఇందిరమ్మ కాలనీలో పెద్ద ఎత్తున మొక్కలు నాటారు. అలాగే స్థానిక కమ్యూనిటీ హాల్ ఆవరణలో వర్షపు నీటిని భూగర్భంలోకి పంపేందుకు వీలుగా ఇంకుడు గుంతల ఏర్పాటుకు మార్కింగ్ (లేఅవుట్) ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, పంచాయతీ మల్టీ పర్పస్ వర్కర్లు, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



# ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి బాక్సింగ్ పోటీలు ప్రారంభం

- జిల్లా విజేతలకు రాష్ట్ర స్థాయి ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే సువర్ణావకాశం

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 5, ప్రభాతవార్త**



కాగజ్‌నగర్ పట్టణంలోని బాల భారతి స్కూల్ ప్రాంగణంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి సబ్ జూనియర్ అండర్-15 బాలబాలికల బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువ బాక్సర్లు పోటీల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుతూ ఉత్సాహంగా బరిలోకి దిగారు. పోటీల ప్రారంభోత్సవానికి కాగజ్‌నగర్ మాజీ మున్సిపల్ చైర్మన్ అబ్దుల్ దస్తగిరి, స్థానిక ఎస్సై సందీప్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు క్రీడాకారులను పరిచయం చేసుకుని, బాక్సర్లతో కరచాలనం చేసి పోటీలకు శుభాకాంక్షలు తెలిపారు. యువత క్రీడల పట్ల ఆసక్తి పెంచుకుని క్రమశిక్షణతో శిక్షణ పొందితే రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో రాణించే అవకాశాలు మెండుగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆసిఫాబాద్ జిల్లా బాక్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూర్ల మధు మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో బాక్సింగ్ క్రీడాభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ జిల్లా స్థాయి పోటీల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు జూన్ 12, 13 తేదీల్లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి బాక్సింగ్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొనే అర్హత సాధిస్తారని వెల్లడించారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువ క్రీడాకారులకు ఇటువంటి పోటీలు మంచి వేదికగా నిలుస్తున్నాయని ఆయన అన్నారు. పోటీల సందర్భంగా వివిధ బరువు విభాగాల్లో బాలబాలికలు పోటీపడుతూ తమ నైపుణ్యాన్ని ప్రదర్శించారు. మ్యాచ్‌లు ఉత్కంఠభరితంగా సాగగా, క్రీడాభిమానులు పోటీలను ఆసక్తిగా వీక్షించారు. పోటీల అనంతరం విజేతలకు పతకాలు అందజేసి అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో మెరుగైన ప్రదర్శన కనబర్చి జాతీయ స్థాయికి చేరుకోవాలనే లక్ష్యంతో యువ బాక్సర్లు కసరత్తు చేస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ముత్తు బాక్సింగ్ క్లబ్ చైర్మన్ శివకుమార్ నాయర్, కార్యదర్శి మదురై శేఖర్, వైస్ ప్రెసిడెంట్ కంబాల జయేందర్, ఎస్సై మోహన్ ప్రసాద్, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పరిధిలోని కోచ్‌లు, క్రీడా నిర్వాహకులు, సీనియర్ క్రీడాకారులు, బాక్సర్లు సాయి వంశీ, శివకుమార్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.




## రైతులకు భరోసా వేళాయే సారు

- వెంటనే నిధులు జమ చేయాలని బీఆర్ఎస్ డిమాండ్

**బజార్‌హత్నూర్, జూన్ 05, ప్రభాతవార్త:**

తెలంగాణలో వానాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతుల ఖాతాల్లో తక్షణమే రైతు భరోసా పెట్టుబడి సాయం నిధులు జమ చేయాలని బీఆర్ఎస్ పార్టీ సోషల్ మీడియా జిల్లా నాయకులు మజర్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం ద్వారా ప్రతి ఎకరానికి ఏడాదికి 10,000 రూపాయల పెట్టుబడి సాయాన్ని సకాలంలో అందించిందని గుర్తుచేశారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో అధికారంలోకి వస్తే 15,000 రూపాయలు ఇస్తామని నమ్మబలికి, అధికారంలోకి వచ్చాక రైతుబంధు పేరును రైతు భరోసాగా మార్చి ఆ నిధులను 12,000 రూపాయలకు కుదించిందని విమర్శించారు. ఆ కుదించిన నిధులను సైతం రైతులకు సకాలంలో అందించడంలో పూర్తిగా విఫలమైందని మండిపడ్డారు. గత 2025లో విడతల వారీగా నిధులు విడుదల చేయడం వల్ల రైతులు నెలల తరబడి ఎదురుచూడాల్సి వచ్చిందని, ప్రభుత్వం 9,000 కోట్ల రూపాయలు విడుదల చేస్తామని ప్రకటించినప్పటికీ క్షేత్రస్థాయిలో రైతులకు సకాలంలో పెట్టుబడి సాయం అందలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎగ్గొట్టిన మూడు విడతల రైతు భరోసా నిధులను ఎప్పుడు ఇస్తుందో సమాధానం చెప్పాలని, దీనిపై శ్వేతపత్రం విడుదల చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు. పంటల సాగు ప్రారంభానికి ముందే ఇవ్వాల్సిన సాయం ఎందుకు ఆలస్యమవుతోందని, అర్హులైన రైతుల పేర్లు జాబితాల నుండి ఎందుకు మాయమయ్యాయని నిలదీశారు. గత ప్రభుత్వం చూపిన వేగాన్ని ఈ ప్రభుత్వం ఎందుకు చూపలేకపోతోందని ఆక్షేపించారు. వ్యవసాయం తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం, రైతుల విషయంలో మాటలు కాకుండా చేతల్లో చూపాలని డిమాండ్ చేశారు. ఒకపక్క పెట్టుబడి సాయం వేయక, మరోపక్క కష్టపడి పండించిన పంటలను సకాలంలో కొనుగోలు చేయక ప్రభుత్వం కేవలం కాలయాపన చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మృగశిర కార్తె ప్రవేశించే లోపు వానాకాలం సాగు పనుల నిమిత్తం రాష్ట్రంలోని అర్హులైన రైతులందరికీ వెంటనే రైతు భరోసా నిధులు జమ చేసి, వారి ఆందోళనకు ముగింపు పలకాలని కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

- పర్యావరణ విద్య అంబాసిడర్ కటుకం మధుకర్

**కాగజ్‌నగర్ రూరల్, జూన్ 5, ప్రభాతవార్త**

ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్‌ఎస్) వేంపల్లి ఆధ్వర్యంలో గురువారం విద్యార్థులు పర్యావరణ పరిరక్షణపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామ ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ చేపట్టి ప్రజలను చైతన్యపరిచారు. చెట్లను నాటుదాం - భవిష్యత్తును కాపాడుదాం ప్లాస్టిక్‌కు దూరంగా ఉండండి - ప్రకృతిని ప్రేమించండి పచ్చదనం పెంచుదాం - కాలుష్యాన్ని తగ్గిద్దాం వంటి నినాదాలతో విద్యార్థులు గ్రామంలో సందేశాన్ని విస్తృతంగా ప్రచారం చేశారు. ర్యాలీ అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద మానవహారం ఏర్పాటు చేసి పర్యావరణ పరిరక్షణకు తమ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పర్యావరణ విద్య అంబాసిడర్ కటుకం మధుకర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. ప్రకృతి వనరుల సంరక్షణ ద్వారా మాత్రమే భావితరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించగలమన్నారు. విద్యార్థులు తమ కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో కూడా పర్యావరణ అవగాహన పెంపొందించాలని సూచించారు. గ్రామ సర్పంచ్ లెండుగురి సత్తయ్య మాట్లాడుతూ ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని పిలుపునిచ్చారు. పరిశుభ్రత, చెట్ల పెంపకంలో గ్రామ ప్రజలు భాగస్వాములు కావాలని కోరారు. విద్యార్థుల ఉత్సాహం, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, గ్రామపంచాయతీ సహకారంతో నిర్వహించిన ఈ కార్యక్రమం విశేష స్పందన పొందింది. ఈ కార్యక్రమంలో గ్రీన్ టీచర్ ప్రకాశ్, శ్రీనివాస్, గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రవీణ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

